

బిందుసేద్యం పరికరాలపై జీఎస్టీ తగ్గింపు

● ఉద్యాన శాఖ పీడీ విజయలక్ష్మి



కనపకుంట గ్రామంలో ఆఫ్టర్ సేల్స్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి

డోన్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బిందుసేద్యం పరికరాలపై 12 శాతం నుంచి 7 శాతం వరకు జీఎస్టీ ధరలు తగ్గించినట్లు ఉద్యాన శాఖ పీడీ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలోని కనపకుంట గ్రామంలో రైతు మధుసూదన్‌రెడ్డికి చెందిన పొలంలో ఆఫ్టర్ సేల్స్ కార్యక్రమం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులు కొత్త డ్రిప్పు పరికరాలకు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డోన్ ఉద్యాన శాఖ అధికారి కళ్యాణి, ఏపీఎంఐసీడీ మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్ సుధాకర్, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ రంగమ్మ, కేంద్ర సిబ్బంది, శివమ్మ, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించండి

● హిట్ అండ్ రన్ కేసులపై జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి

కర్నూలు లీగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో హిట్ అండ్ రన్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు నష్టపరిహారాన్ని అందజేయాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి ఆదేశాలు జారీ చేశారు. విక్టిమ్ కాంపెన్సేషన్ కేసులపై జిల్లా స్థాయి అధికారుల మానిటరింగ్ సమావేశం బుధవారం స్థానిక జిల్లా కోర్టులో నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో పాటు నారాయణపేట జిల్లా అధికారులతో కూడా ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ ట్రయల్ బాధితులు, హిట్ అండ్ రన్ కేసుల బాధితులకు నష్టపరిహారంతో పాటు అనాథ బాలలకు ఆధార్ కార్డులు మంజూరు చేసే విషయంపై ఆయన ఈ సమావేశంలో సమీక్షించారు. బాధితులకు రెండు కేసులలో రూ.12.50 లక్షలను నష్టపరిహారంగా ఆయన అధికారులతో సంప్రదించి మంజూరు చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆధార్ కార్డు లేని 120 మంది అనాథ బాలలను గుర్తించారని, వారిలో 56 మందికి ఆధార్ కార్డులను మంజూరు చేసి మిగతా వారికి సత్వరమే ఆధార్ కార్డులను అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి, అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి దివాకర్, ఏజీపీ సయ్యద్ షాబుద్దీన్, మెంబర్ పి. శివసుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నిండా ముంచిన తుఫాను

● నీట మునిగిన పంట పొలాలు



గొట్లూరులో నీట మునిగిన మొక్కజొన్న పంటను చూపిస్తున్న రైతు

చాగలమర్రి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో బుధవారం చాగలమర్రి మండలంలో ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. 17.7 మి.మీ వర్షపాతం నమోదైంది. తుఫాన్ వర్షంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రహదారులపై ఆరబెట్టుకున్న మొక్కజొన్న ధాన్యం తడిసిపోయింది. పెద్దబోదనం, చిన్నబోదనం, గొట్లూరు, ముత్యాలపాడు, గొడిగనూరు, చాగలమర్రి గ్రామాల్లోని రహదారుల్లో 2 వేల క్వింటాళ్లు పైగా ఆరబెట్టుకున్న మొక్కజొన్న తడిసి దెబ్బతినిపోయిందని రైతులు కన్నీరు పెడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పిలువకుండానే పలకరించే వర్షాల ధాటికి రైతులు కుదేలవుతున్నారు. పంట కోత దశకు రావడంతో కొద్ది రోజులుగా వీటిని కొందరు తొలగించగా మరి కొందరు అదే పనుల్లో ఉన్నారు. పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా వీటిని నూర్పిడి చేసుకొని గిట్టుబాటు ధరకు అమ్ముకోవడం కష్టంగా మారింది. రైతన్నను పదే పదే తుఫాన్ వర్షాలు వెంటాడుతున్నాయి. పంట సాగుకు చేసిన ఖర్చు కూడా చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గొట్లూరు, నేలంపాడు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగి నీటిలోనే కుళ్లిపోతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు.

మహిళ దారుణ హత్య
వివాహేతర సంబంధమే కారణం? 7

శాశ్వత లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం 6

వీగిన అవిశ్వాసం 7




పూజలు చేస్తున్న ఈవో



ఆకాశదీపం వెలిగిస్తున్న దృశ్యం

శ్రీగిరికి కార్తీక శోభ

● తొలిరోజు పోటెత్తిన భక్తులు
● స్వామివారి సేవలు, దర్శనాల్లో పలు మార్పులు





కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్లింగం, శక్తిపీఠం కలిగిన ఏకైక క్షేత్రం శ్రీశైలంలో బుధవారం కార్తీక మాస ఉత్సవాలు ఘనంగా జరిగాయి. నవంబరు 21వ తేదీ వరకు జరిగే ఉత్సవాల కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో శ్రీగిరికి కార్తీక శోభ అల్లుకుంది. తెల్లవారుజాము నుంచే వేలాదిమంది భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. హరహర మహాదేవ అంటూ నినదిస్తూ క్షేత్రంలో శివనామస్మరణ చేశారు. కిలోమీటర్ల పొడవున భక్తులు క్యూలైన్లలో ఉంటూ స్వామివారిని దర్శించుకున్నారు. ఏపీతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల నుంచి భక్తులు పోటెత్తారు. సాయంత్రం మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మల్లన్నకు మొక్కులు తీర్చుకున్నారు.

ఇదిలా ఉండగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సాధారణ భక్తులకు సులభంగా దర్శనం కల్పించేందుకు పలు మార్పులు చేశారు. అభిషేకాలను రద్దు చేసి, విడతల వారీగా మల్లన్న దర్శనం కల్పిస్తున్నారు. అయితే హోమాలు, కల్యాణోత్సవాలు మాత్రం యథావిధిగా జరుగుతాయి. కార్తీక మాసంలో రూ.5వేల గర్భాలయ అభిషేకం టికెట్లు, రూ.1500 సామూహిక అభిషేకం టికెట్లను రద్దు చేసినట్లు ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు. రోజూ విడతల వారీగా మల్లికార్జున స్వామి స్పర్శదర్శనం కల్పిస్తున్నట్లు తెలిపారు. శని, ఆది సోమవారాల్లో అంతరాలయంలో జరిగే అమ్మవారికి కుంకుమార్చనలను నిలిపివేసి, వేదాశీర్వచన మండపంలో నిర్వహిస్తామని తెలిపారు. కార్తీకమాసం సందర్భంగా ప్రతి సోమవారం ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం నిర్వహిస్తామన్నారు. నవంబరు 14న కోటి దీపోత్సవం, నవంబరు 18న తెప్పోత్సవం ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయని ఈవో తెలిపారు.

● ప్రతి సంవత్సరం శ్రావణ, కార్తీకమాసాల్లో దేవస్థానం శివసప్తాహ భజనలు నిర్వహిస్తోంది. బుధవారం పవిత్ర అఖండ భజనలు, కార్తీక మాసోత్సవాలను ఆలయ ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగాలని మహాగణపతి పూజ, అనంతరం శాస్త్రోక్తంగా చండీశ్వరస్వామికి విశేష పూజలు జరిపారు. పూజల అనంతరం శివప్రణవ పంచాక్షరీనామ అఖండ భజన కార్యక్రమాలను ప్రారంభించారు. కర్నూలు జిల్లాకు చెందిన మూడు భజన బృందాలకు, కర్ణాటకకు చెందిన మూడు భజన బృందాలకు అవకాశం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు శివప్రసాద్ స్వామి, అర్చకస్వాములు, అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



దీపం వద్ద చిన్నారి మొక్కులు



క్యూలైన్‌లో భక్తుల కిటకిట

భక్తిభావాన్ని పెంచడంలో దేవస్థానాలు కీలకం

● మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఫరూక్



ప్రథమ నందీశ్వరునికి అభిషేకం చేస్తున్న మంత్రి ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల కల్చరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భక్తిభావాన్ని పెంపొందించడంలో దేవస్థానాలు కీలక పాత్ర పోషిస్తాయని మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. బుధవారం నంద్యాల ప్రథమ నందీశ్వరాలయంలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ముందుగా మంత్రి ఫరూక్ కేదారేశ్వరీ సమేత ప్రథమ నందీశ్వరాలయంలో కార్తీకమాసం సందర్భంగా మంత్రి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటుచేసిన అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని, భక్తులకు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకును, నీటిసరఫరా వ్యవస్థను, ఐదు వసతి గృహాలను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, చలం బాబు, పూజారి ప్రవీణ్, విశ్వనాథరెడ్డి, హరి, విశ్వం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు భిక్ష ఏర్పాటు

అయ్యప్పసేవా సమాజం ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. జనవరి 10వ తేదీ వరకు ఉచిత భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అయ్యప్ప మాలాధారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయండి

కలెక్టర్ రాజకుమారి



నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి అవకాశాలు సృష్టించే పారిశ్రామిక రంగాన్ని మరింతగా అభివృద్ధి పరచడానికి నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. పారిశ్రామిక రంగ అభివృద్ధి ద్వారానే నిరుద్యోగ యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. అందుకే నూతన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పూర్తిస్థాయి సహకారం అందించాలని అన్నారు. వారు పరిశ్రమలు స్థాపించడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తక్షణమే పరిష్కరించి, అన్ని అనుమతులు వేగవంతంగా మంజూరు చేయాలని సూచించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్ చార్జీల సబ్సిడీ, సేల్స్‌ట్యాక్స్ రాయితీలు వంటి పథకాల కింద జిల్లాలో ఉత్పాదక, సేవారంగాలకు చెందిన 25 యూనిట్లకు రూ.210.37 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాలను కమిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ ఎస్. మహబూబ్‌బాషా, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్రకుమార్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

అహోబిలంలో ఘనంగా స్వాతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు

ఆళ్లగడ్డ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో బుధవారం స్వాతి నక్షత్రం పర్వదినం సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి కిడాంబి వేణుగోపాల స్వామి ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాద వరద స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. లక్ష్మీనరసింహ స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా వేదపండితులు హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామిని పల్లకీలో ఉంచి ఆలయ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. స్వాతి వేడుకలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. భక్తులకు ఆలయ ఆవరణలోని అన్నదాన సత్రాల యజమానులు అన్నదానం నిర్వహించారు.

పోస్టాఫీసులో సర్వర్ సమస్య

● లబ్ధిదారులకు డబ్బులు ఇవ్వలేమని బోర్డులు పెట్టిన వైనం



తల్లికి వందనం డబ్బులు అడగరాదని పోస్టాఫీసులో పెట్టిన బోర్డు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో సర్వర్ సమస్య తలెత్తింది. దీని వల్ల లావాదేవీలు జరగవని, డబ్బులు ఇవ్వలేమని బోర్డు పెట్టారు. తల్లికి వందనం పథకానికి సంబంధించిన డబ్బులు పోస్టాఫీసులోని ఇండియన్ పోస్టు పే మెంట్ బ్యాంక్(ఐపీపీబీ) ఖాతాలో లబ్ధిదారులకు జమ అయ్యాయి. వాటిని తీసుకునేందుకు వచ్చిన తల్లులకు పోస్టాఫీసులో చుక్కలు చూపిస్తున్నారు. సర్వర్ డౌన్ కావడంతోపాటు కౌంటర్‌లో డబ్బులు ఇవ్వాల్సిన సిబ్బంది ఇతర కార్యక్రమాలకు, శిక్షణకు వెళ్లినట్లు అధికారులు చెబుతున్నారు. తల్లికి వందనం డబ్బులు ఇవ్వలేమని బోర్డులు పెట్టేసారు. దీంతో లబ్ధిదారులు నిరాశగా వెనుతిరుగుతున్నారు.

ప్రశాంతంగా లా సెమిస్టర్

కర్నూలు అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): లా 3, 5 సంవత్సరాల రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. గురువారం నగరంలోని ఉస్మానియా కళాశాలలో జరిగిన పరీక్షకు 3వ సంవత్సరంలో 359 మంది దరఖాస్తు చేసుకోగా 319 మంది, 5వ సంవత్సరం 2వ సెమిస్టర్లో 65 మంది దరఖాస్తు చేసుకోగా 58 మంది హాజరయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

● చైర్మన్ ఎం. వెంకట హరినాథ్

కర్నూలు లీగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రయోజనాల సేవల ద్వారా నష్టపోయిన బాధితులకు శాశ్వత లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం అందజేస్తున్నట్లు శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం. వెంకట హరినాథ్ తెలిపారు. బుధవారం పరిష్కారమైన ఓ కేసులో ఆయన ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు జిల్లా పంచలింగాల చెందిన ఫిర్యాది ఏ. మదన్ మోహన్ కనకదుర్గ ఫైనాన్స్ కంపెనీ నుంచి ఓ వాహనాన్ని తీసుకున్నారు. బాధితుడు వరుసగా అన్నీ ఈఎంఐలు చెల్లించినప్పటికీ ఆర్థిక సమస్యలతో రెండు ఈఎంఐలను చెల్లించలేదు. ఆ తర్వాత ఫైనాన్స్ కంపెనీతో ఒప్పందం చేసుకుని రూ.25వేలను చెల్లించడానికి అంగీకరించి రూ.20వేలను చెల్లించాడు. మిగతా రూ.5వేలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ వారు బాధితుడి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీంతో బాధితుడు శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించడంతో బాధితుడికి కలిగిన నష్టాన్ని రూ.69వేలతో పాటు మానసిక వేదన కలిగించినందుకు మరో రూ.20వేలను చెల్లించాలని లోక్ అదాలత్ ఫైనాన్స్ కంపెనీని ఆదేశించింది. ఈ కార్యక్రమంలో సభ్యులు శివశంకర్ రెడ్డి, రాజుబాబు, శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

50 ఎకరాల్లో వరి పంట వర్షార్పణం



నేలకొరిగిన వరి పంట

కోసిగి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మిగనూరు గ్రామంలో అకాల వర్షానికి వరి రైతులకు అపార నష్టం కలిగించింది. బుధవారం కురిసిన అకాల వర్షానికి తుమ్మిగనూరు గ్రామంలో రైతులు వారం ఈరన్న ఐదెకరాల్లో చేతికొచ్చిన వరి పైరు పూర్తిగా నేలకొరిగింది. దీంతో రూ.2 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన కోసిగి అయ్యప్పరెడ్డి, హరిజన దేవమణి, స్వామిదాసు, హరిజన బోడి తిమ్మప్ప, వారం ఈరారెడ్డి రైతులకు చెందిన రైతులకు సుమారు 50 ఎకరాల మేర చేతికొచ్చిన వరి పైరు అకాల వర్షానికి వరి పొలాల్లో నేలకొరగడంతో తీవ్ర నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మూగజీవాలకు మేతగా ఉల్లి



చింతలచెరువులో గొర్రెలకు వదిలేసిన ఉల్లి పంట

రైతులకు ఉల్లి కన్నీళ్లు తెప్పిస్తోంది. అష్టకష్టాలు పడి ఉల్లి పంటను సాగుచేశారు. దిగుబడి ఏతికొచ్చే సమయంలో ఉల్లి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కూలీల ఖర్చులు కూడా రాకపోవడంతో కొందరు ఉల్లిని పొలాల్లోనే వదిలేశారు. మరికొందరు మూగజీవాలకు మేతగా మార్చేశారు. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చింతలచెరువు, కొలుములపేట గ్రామంలో రైతులు శ్రీనివాసరెడ్డి, నంజీవరెడ్డి, ఎర్రం సురేష్‌రెడ్డి, మద్దిలేటి, మరి కొందరు రైతులు తమ పొలాల్లోనే ఉల్లిగడ్డలను గొర్రెల కోసం వదిలేశారు. ప్రభుత్వం స్పందించి పరిహారమిచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

● చాగలమర్రి, ఆంధ్రజ్యోతి

కంది రైతు విలవిల!





● అధిక వర్షాలతో పంటకు ఆశించిన పురుగులు
● రాలిపోతున్న పూత
● దిగుబడులు తగ్గిపోతాయని ఆందోళన
● జిల్లాలో 95,262 ఎకరాల్లో కంది పంట సాగు

గోనెగండ్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సాగు చేసిన కంది పంట ఆశాజనకంగా కనిపించినా అధిక వర్షాలతో పంటకు కాయ ఈగ, శనగపచ్చ పురుగు, మారుకా మచ్చపురుగు సోకింది. కంది రైతు విలవిలలాడుతున్నాడు. కంది పంటకు ఈ ఏడాది గిట్టుబాటు ధర లభిస్తుందన్న ఆశలో జిల్లా వ్యాప్తంగా 95, 262 ఎకరాల్లో సాగుచేశారు. గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలాల్లో బావులు, బోర్ల కింద దాదాపు 8000 ఎకరాల్లో కందిని వేశారు. చాలా మంది రైతులు వేరుశనగతో పాటు ఇతర పంటలో కూడా అంతర్‌పంటగా కూడా వేశారు. గోనెగండ్ల, కులుమాల, అలువాల, పెద్దమరివీడు, చిన్న మరివీడు, వేముగోడు, పుట్టపాశం, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, తిప్పనూరు, హెచ్ కైరవాడితో పాటు పలు గ్రామాల్లో కంది పంటను సాగుచేశారు. ప్రస్తుతం సోకిన పురుగుకు ఎన్ని మందులు పిచికారి చేసినప్పటికీ అదుపులోకి రావడంలేదు. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. శనగపచ్చ పురుగు, కాయ ఈగ, జీడపురుగు, మారుకామచ్చ తెగులు ఎక్కువగా ఉండటంతో పూత మొత్తం రాలిపోతుంది. దిగుబడులు తగ్గిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకునేలా వ్యవసాయశాఖ అధికారులు సూచనలు చేస్తున్నారు.

మారుకామచ్చ పురుగు

ఈ పురుగు ఎక్కువగా సోకినట్లు తెలుస్తుంది. ఈ పురుగు రెక్కలు పురుగు గుడ్లనుంచి పొదిగిన లార్వాలు ఆకులు, పూత, కాయలను లోపల నుంచి తిని నష్టం చేస్తాయి. ఈ పురుగు నివారణకు ఏమమెక్టిన్‌బెంజోఎట్ 0.3 గ్రాములు లేదా నోవాలురాన్ మిల్లీ లీటర్ లేదా అంప్టిగో 1 మిల్లీ లీటర్‌ను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

కాయ ఈగ: ఈ పురుగు కనబడకుండా చాలా నష్టం నలుగజేస్తుంది. తన గుడ్లను కాయ చర్మం తొలిచి అక్కడ పెడుతుంది. వాటి నుంచి పొదిగిన పిల్ల పురుగులు లోపల నుంచి కాయలను తిని నష్టం కలిగిస్తాయి. ఈపురుగు నివారణకు ముందస్తుగా అసిఫేట్ 1.5 గ్రాములు లేదా థయాక్లోప్రిడ్ 0.7 గ్రాములు ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలి.

శనగపచ్చ పురుగు: ఈ పురుగు లార్వాలు కాయలపై రంధ్రం చేసుకొని లోపలికి వెళ్లి తిని నష్టం కలిగిస్తాయి. ఈ పురుగు నివారణకు ఏమమేక్టిన్ బెంజోఎట్ 0.3 గ్రాములు లేదా స్పినోసాడ్ 0.3 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటిలో మరియు 2శాతం బెల్లం ద్రావణం కలుపుకొని సాయంత్రం వేళల్లో పిచికారి చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

అధికారులు సలహాలివ్వాలి

పురుగులతో పూత మొత్తం రాలిపోతుంది. ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం కనిపించడం లేదు. అధికారులు పంటలను పరిశీలించి సలహాలివ్వాలి. ఏ మందు పిచికారి చేయాలి ఎంత చేయాలనే విషయాన్ని వివరించాలి.

● మాబు, రైతు, గోనెగండ్ల

సకాలంలో పిచికారి చేయాలి



రైతులు సకాలంలో పురుగును గుర్తించి మందులు పిచికారి చేయాలి. గోనెగండ్ల మండలంలో కంది పంటకు దోమ, శనగపచ్చ పురుగు సోకింది. కంది పంట ఏపుగా పెరిగింది. మామూలు పద్ధతిలో కాకుండా డ్రోన్ ద్వారా పిచికారి చేస్తే మందు, ద్రావణం మొక్క పైభాగంలో చేరుతాయి. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే దిగుబడి బాగా వస్తుంది.

● మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు.

'ఉపాధి' బడ్జెట్ రూపకల్పన

● గ్రామాల వారీగా ప్రణాళిక తయారీకి శ్రీకారం
● రూ.265 కోట్లతో కార్యాచరణ



కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) సంబంధించి ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు డ్వామా అధికారులు చర్యలు చేపట్టారు. ఏటా ఈపనుల కోసం డిసెంబరులోనే బడ్జెట్‌ను తయారు చేస్తారు. అక్టోబరు 3న మొదటి గ్రామసభలో ప్రణాళిక తయారీపై చర్చించాలని, నవంబరు 18న ఆయా గ్రామ పంచాయతీలు బడ్జెట్‌ను రూపొందించారు. అదే నెల 30న మండల పరిషత్, డిసెంబరులో 15వ తేదీకి జడ్పీ తమ ప్రణాళికలను ఆమోదించాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు జారీచేసింది. ఈప్రక్రియ మొత్తం డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేయాలని ప్రణాళికను యుక్తదార పోర్టల్‌లో అప్‌లోడు చేయాలని, ఒక వ్యక్తికి రోజుకు రూ.307ల వేతనం మెటీరియల్ కింద 204.66 ఖర్చు మొత్తం కలిపి రూ.511.66 బడ్జెట్‌ను రూపొందిస్తారు.

నాలుగు కేటగిరిల కింద 192 రకాల పనులకు..

నాలుగు కేటగిరీల కింద 192 రకాల పనులకు ఈ పథకం కింద అవకాశం కల్పించాలని కేంద్రం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వ్యక్తిగత, సామాజికపరమైన పనులున్నాయి. మొక్కలు నాటడం, ఫీడర్ కెనాల్స్ నిర్మాణం, ఫీల్డ్ బండ్స్, భూమి అభివృద్ధి, కమ్యూనిటీ వాటర్ హార్వెస్టింగ్ పాండ్స్ రీచార్జి కిట్లు, పర్కులేషన్ ట్యాంకుల నిర్మాణం, వర్షం నీటి సంరక్షణ, ట్రెంచ్‌లు, చెక్‌డ్యామ్‌లు, సాగునీటి బావుల నిర్మాణం, పంట కాలువలు చెరువుల్లో పూడిక తీత, కందకాల తవ్వకాలు, పండ్లతోటల పెంపకంతో పాటు తుఫాన్ షెల్టర్లు, ప్రభుత్వ భవనాలు, రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ పూర్తి కావస్తుండటంతో రబీ మొదలు కావడంతో ఉపాధి పనులు కొంత మందగించాయి. ప్రణాళిక పూర్తికాగానే పనులు త్వరితగతిన ప్రణాళిక ప్రకారం చేయడం జరుగుతుందని డ్వామా సంస్థ అధికార వర్గాలు తెలిపాయి.

కమిటీలు ఏర్పాటు

గ్రామ పంచాయతీ స్థాయిలో ఈ బడ్జెట్ రూపకల్పనకు కమిటీలు ఏర్పాటు చేశారు. దీనిలో సాంకేతిక సహాయకులు, జీఎస్టీ, సచివాలయ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, క్షేత్ర సహాయకులు పంచాయతీలో సీనియర్ మేట్లు, లైన్ డిపార్టుమెంట్ల నుంచి సభ్యులు ఉంటారు. ఈ బృందాన్ని ఏపీవో పర్యవేక్షిస్తారు. గ్రామసభల షెడ్యూల్ పీవో, ఎంపీడీవోలు నిర్ణయిస్తారు. కూలీలు, హేబిటేషన్ల ప్రాతిపదికన మూడు, నాలుగు రోజుల్లో ప్రణాళిక తయారు చేయాలి. ఈసారి కొత్త సంవత్సరం చేపట్టబోయే పనుల్లో గ్రామాల్లో పాడిపశువుల కోసం గోకులాలు, మ్యాజిక్ డ్రైన్లకు ప్రాధాన్యమిచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు మూడున్నర లక్షల మందికి జాబ్‌కార్డులు ఇచ్చారు. ఈ రెండు జిల్లాల్లో 5 లక్షల మంది దాకా సీజన్‌లో పనులు చేస్తున్నారు. ప్రస్తుతం క్రియాశీలక జాబ్‌కార్డులు రెండున్నర లక్షల దాకా ఉన్నాయి. రెండు జిల్లాలో కలిపి వేసవి సీజన్‌లో 2లక్షల మంది దాకా పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం



వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద రైతులు, కూలీలకు పనులు కల్పించేందుకు అవసరమైన ప్రణాళికలను గ్రామాల వారీగా రూపొందించాలని కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. దశల వారీగా ఉపాధి ప్రణాళికను గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు తయారు చేసి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

● వెంకటరమణయ్య, పీడీ, కర్నూలు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా, నవంబరు 1 నుంచి 7 వరకు టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న 'కర్నూలు ఉత్సవ్-2025' కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటుచేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ నాటక అకాడమీ, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవ్‌లో ఉన్నత పాఠశాలల వారిని జూనియర్స్‌గా, కళాశాల వారిని సీనియర్స్‌గా పరిగణిస్తామని పేర్కొన్నారు. 'ఉమ్మడి కర్నూలు జిల్లా వైభవం' అనే అంశంపై ఈ పోటీలు ఉంటాయని, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటూ కన్సొలేషన్ బహుమతులు అందిస్తామని వివరించారు. ఈ పోటీలు ఈనెల 31న ఉదయం 10.30 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో ఉంటాయని, ఒక్కో విద్యాసంస్థ నుంచి 5గురి పేర్లను 99892 65632కు ఈనెల 27 తేదీలోగా పంపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి కళాక్షేత్రం ప్రతినిధులు పీపీ గురుమూర్తి, చంద్రకంటి మద్దయ్య, డి.ఈశ్వరయ్య కన్వీనర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు.

ఆఫీసు సబార్డినేట్ పోస్టు దరఖాస్తులకు ఆహ్వానం

కర్నూలు లీగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ కార్యాలయంలో తాత్కాలిక పద్ధతిలో పని చేయడానికి ఆఫీసు సబార్డినేట్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి తెలియజేశారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి 7వ తరగతి పాస్ అయిన వారు, లేదా ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన వారు అర్హులని అన్నారు. ఈ దరఖాస్తులను జిల్లాలోని ఏదైనా కోర్టు ఆన్‌లైన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వాటిని నవంబరు 1వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలను ఉమ్మడి జిల్లాలోని అన్ని కోర్టుల వెబ్‌సైట్‌లలో చూడవచ్చని అన్నారు.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

● మహానందిలో కార్తీక మాస ఉత్సవ ఏర్పాట్లు
● ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డితో ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



మహానంది, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసి నెల రోజుల పాటు జరిగే కార్తీక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని మహానంది ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి తెలిపారు. కార్తీకమాసం ప్రారంభమైన నేపథ్యంలో ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లపై బుధవారం ఈఓ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: కార్తీక మాసంలో భక్తులకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

ఈఓ: నవంబరు 20 వరకు నిర్వహించనున్న కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకొని క్షేత్రానికి వచ్చే భక్తులకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేశాం.

ప్రశ్న: దర్శనం సమయం ఏవిధంగా ఏర్పాటు చేస్తున్నారు?

ఈఓ: రద్దీ అధికంగా ఉంటుందని భావించి ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 వరకు నిరంతరం దర్శనం ఏర్పాటు చేశాం.

ప్రశ్న: సాధారణ భక్తులకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

ఈఓ: సాదారణ భక్తులకే ప్రాధాన్యం ఇస్తాం. ఉచిత క్యూలైన్ ఏర్పాటుతో వృద్ధులకు, వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటుతో పాటు విశ్రాంతి కోసం పరిసరాల్లోని పోచా విశ్రాంతి భవనాన్ని ఉచితంగా కేటాయించాం. క్యూలైన్లలో పాలు, బిస్కెట్లు అందజేస్తాం. భక్తుల భద్రత కోసం అదనంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. వాహనాల కోసం రెండు ప్రదేశాల్లో లైటింగ్‌తో కూడిన పార్కింగ్ ఏర్పాటు చేశాం.

ప్రశ్న: అన్న ప్రసాదం కల్పిస్తున్నారా?

ఈఓ: కార్తీక మాసం సందర్భంగా ఆది, సోమవారాల్లో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తులకు దేవస్థానం తరపున నిత్యాన్నదాన సత్రంలో అన్నదానం నిర్వహిస్తాం.

ప్రశ్న: కార్తీక పౌర్ణమి రోజు కోటి దీపోత్సవం, జ్వాలా తోరణానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారా?

ఈఓ: నవంబరు 5న క్షేత్రంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని కోటి ఒత్తులతో కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం నిర్వహిస్తాం. వేలాదిమంది భక్తులు పాల్గొనే విధంగా ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: లడ్డు ప్రసాదాలు సిద్ధం చేశారా?

ఈఓ: రద్దీకి అనుగుణంగా భక్తులకు కోరినన్ని లడ్డు ప్రసాదాలు అందచేస్తాం. రద్దీ రోజుల్లో మరిన్ని ప్రసాదాలు తయారు చేసి ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయిస్తాం.

ప్రశ్న: పరోక్ష సేవలో భాగంగా రూ.2 వేలు అందించే భక్తులకు ఏవిధంగా సేవలు అందిస్తారు?

ఈఓ: కార్తీకమాసం క్షేత్రానికి రాలేని భక్తుల కోసం పరోక్ష సేవలు ప్రవేశ పెట్టాం. ప్రతిరోజు గోత్రం, పేరుతో అభిషేకం, మాసం ముగిశాక ప్రసాదాలను పోస్టుద్వారా పంపుతాం.

ప్రశ్న: కార్తీకమాసంలో ప్రత్యేక ఏర్పాట్లు?

ఈఓ: ఆలయ గోపురాలతో పాటు పరిసరాలకు విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేశాం. రద్దీ రోజుల్లో గర్భాలయంలో కాకుండా సామూహిక అభిషేకాలు ఏర్పాటు చేస్తాం. నాలుగు సోమవారాల్లో రాత్రి వేళల్లో జలహారతి ఏర్పాటు చేస్తున్నాం. అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చేస్తాం. మైకుల ద్వారా భక్తులకు సూచనలు ఇస్తాం. అన్ని శాఖల సహకారంతో పాటు ఆలయ సిబ్బంది సమిష్టి కృషితో కార్తీక ఉత్సవాలను నిర్విఘ్నంగా పూర్తి చేస్తాం.

రాఘవేంద్రుడి సేవలో

కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే

● మంత్రాలయంలో తెలంగాణ, కర్ణాటక మంత్రులు



కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు

మంత్రాలయం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని బుధవారం కర్ణాటక రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ దర్శించుకున్నారు. ఆయనతో పాటు తెలంగాణ క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిట శ్రీహరి, కర్ణాటక చిన్ననీటి పారుదల శాఖ మంత్రి బోసేరాజు, రాయచూరు ఎంపీ కుమార్ నాయక్, మంత్రాలయం, మాన్వీ, మస్కీ, రాయచూరు రూరల్, సింధనూరు ఎమ్మెల్యేలు వై.బాలనాగిరెడ్డి, హంపయ్యనాయక్, బసవన్నగౌడు, దద్దాల బసవన్నగౌడు, హంపన్నగౌడు, ఎమ్మెల్సీలు బసన్నగౌడు బడాలీ, వసంతకుమార్, బసవరాజుపాటిల్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు సురేష్ కోణాపూరు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తిలు వేదపండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు వివరించారు. వీరికి రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షింతలు , పరిమళ ప్రసాదం, వెండిగిన్నెలు ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట రాజా ఎస్ అప్రమేయ ఆచార్, కృష్ణ కౌసిక్, కిరణ్ కుమార్, సంజీవ్ కులకర్ణి, రాయచూరు ఎస్పీ పుట్టమాదయ్య, కలెక్టర్ నితీష్, కర్నూలు ఏఎస్పీ హుస్సేన్ పీర, ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి, రాయచూరు సీఈఓ ఈశ్వర్‌కుమార్ పాండు, ఏసీ గజానంద్ బోలె, రాయచూరు ఏఎస్పీలు హరీష్, కుమార్‌స్వామి, శాంతివీర, తహసీల్దారు రమాదేవి, సీఐలు రామాంజులు, మంజునాథ్, పద్మనాభతీర్థ ఏసీ గెస్ట్‌హౌస్, పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రదక్షిణలు చేస్తున్న డీకే శివకుమార్, మంత్రులు

మూలరాములకు మహాభిషేకం

- శ్రీమఠానికి పోటెత్తిన భక్తులు

మంత్రాలయం శ్రీమఠంలో బుధవారం బలి పాడ్యమిని పురస్కరించుకుని మూలరాములకు పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మహాభిషేకం నిర్వహించారు. ఏడాదికి రెండుసార్లు జరిగే (శ్రీరామనవమి, బలిపాడ్యమి)ని పూర్ణబోధ పూజామందిరంలో ఘనంగా నిర్వహించడం శ్రీమఠంలో సంప్రదాయంగా వస్తోంది. పూర్ణబోధ పూజా మందిరంలోని వెండి మండపంలో బంగారు మంటపం అధిష్టించి అందులో నవరత్నాలతో మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు అభిషేకం చేశారు. క్షీరాభిషేకం, తులసి అర్చన, పుష్పాభిషేకం, స్వర్ణ నాణేలతో అభిషేకం, గంధలేపనం, వివిధ పదార్థాలతో మహాఅభిషేకం నిర్వహించారు. ఈ వేడుకను కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ, కర్ణాటక మంత్రులు వాకిట శ్రీహరి,బోసేరాజులతో పాటు వేలాది మంది భక్తులు తిలకించారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు రజిత గజవాహనం, బంగారు రథ సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ పండిత కేసరి రాజా ఎస్.గిరిరాజాచార్, సూపరింటెండెంట్లు అనంత పురాణిక్, విజయేంద్ర ఆచార్, వ్యాసరాజాచార్, జయతీర్థ ఆచార్ తదితరులు పాల్గొన్నారు.



మూల రాములకు అభిషేకం చేస్తున్న పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు

మీ పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటా..

• ఐసీడీఎస్ అధికారులకు అంగన్‌వాడీ కార్యకర్త బెదిరింపు



దాచి ఉంచిన స్టాక్‌తో అధికారులు

ఆళ్లగడ్డ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కోడి గుడ్లు, ఇతర పౌషికాహారం ఉన్న ఇంటికి తాళాలు తీస్తే మీ పేరు రాసి అత్మహత్య చేసుకుంటానని 25 సెంటర్ అంగన్‌వాడీ కార్యకర్త అధికారులను బెదిరించింది. ఈ సంఘటన బుధవారం జరిగింది. పట్టణంలోని పాత బస్టాండ్ దగ్గర ఉండే శివాలయం పక్కన ఓ ఇంట్లో అంగన్‌వాడీ పిల్లలకు ఇచ్చే కోడి గుడ్లు, ఇతర పౌష్టికాహారం ఉన్నట్లు ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందింది. ఆ శాఖ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ పాతబస్టాండ్‌లోని ఆ ఇంటికి చేరుకొన్నారు. అప్పటికే అంగన్‌వాడీ టీచరు కోడి గుడ్లు దాచిన ఇంటికి తాళం వేసుకొని వెళ్లి పోయింది. దీంతో సూపర్‌వైజర్ దస్తగిరిమ్మ కూడా మరో తాళాన్ని ఆ ఇంటికి వేసి సమాచారం ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఐసీడీఎస్ అధికారులు సదరు అంగన్‌వాడీ టీచర్‌ను ఇంటి వద్దకు రావాలని ఎన్నిసార్లు చెప్పినా రాలేదు. పైగా ఇంటి దగ్గరి నుంచి అధికారులంతా వెళ్లిపోవాలని, లేదంటే మీ పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. దీంతో సీడీపీఓ తేజేశ్వరి, పాలసాగరం సచివాలయ అధికారులు, పోలీసు అధికారుల సమక్షంలో తాళాలు తీసి అందులో ఉన్న స్టాక్‌ను ఐసీడీఎస్ అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. దీనిపై పూర్తి స్థాయి దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని సీడీపీఓ తేజేశ్వరి తెలియజేశారు.

ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న వాహనం బోల్తా



వాహనం నుంచి వస్తున్న పొగలు

గూడూరు (కోడుమూరు రూరల్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కే నాగలాపురం సమీపంలో ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న క్రూసర్ వాహనం బోల్తా పడింది. కర్నూలు నుంచి కొంతమంది ఉపాధ్యాయులు క్రూసర్ వాహనంలో ప్రతిరోజూ విధులకు వెళుతుంటారు. బుధవారం ఉదయం వాహనం టైరు పేలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనతో వాహనం నుంచి పొగలు వెలువడ్డాయి. అటుగా వెళుతున్న వాహనదారులు, స్థానికులు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టి అందరినీ బయటకు లాగారు. ప్రమాదంలో కొందరికి మూగదెబ్బలు తగిలాయి.

అమేజాన్ కంపెనీ ఎండీకి అరెస్టు వారెంట్

• వినియోగదారుల కమిషన్ ఆదేశం

కర్నూలు లీగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వినియోగదారుల కమిషన్ జారీ చేసిన ఆదేశాలను ఖాతరు చేయని అమేజాన్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు మరో ఇద్దరికి అరెస్టు వారెంట్లు జారీ చేస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు జిల్లా సి.బెళగల్ గ్రామానికి చెందిన ఫిర్యాదీదారు కురువ వీరేష్ 2024 సెప్టెంబరు 29న యాపిల్ ఐఫోన్ 15+ ఫోన్‌ను ఆన్‌లైన్‌లో బుక్ చేశారు. ఈ మేరకు ఆయన రూ.79,900 ఆన్‌లైన్ ద్వారా పేమెంట్ చేశాడు. అయితే.. అమేజాన్ కంపెనీ ఆర్డర్ చేసిన మోడల్‌కు బదులుగా ఐక్యూ00 నియో9 ప్రో అనే సెల్ ఫోన్‌ను అందజేసింది. అయితే.. తాను పెట్టిన ఆర్డర్‌కు బదులుగా వేరే మోడల్‌ను డెలివరీ చేయడంతో వీరేష్ జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు కమిషన్ అమేజాన్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు మరో ఇద్దరికి నోటీసులు జారీ చేసినా కూడా వారు హాజరు కాలేదు. దీంతో ఫిర్యాదికి ఐఫోన్ ఖరీదు రూ.79,900, 12 శాతం వడ్డీతో పాటు మానసిక ఆవేదన, కోర్టు ఖర్చుల కింద మరో రూ.35వేలను 45 రోజుల్లోపు అందజేయాలని గతంలో ఆదేశాలు జారీ చేసింది. అయినా కూడా అమేజాన్ కంపెనీ, ప్రతివాదులు జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశాలను ఖాతరు చేయలేదు. దీనిపై ఆగ్రహించిన కమిషన్ అమేజాన్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌కు అరెస్టు వారెంట్లు జారీ చేసి కేసును ఈ ఏడాది నవంబరు 21వ తేదీకి వాయిదా వేస్తూ చైర్మన్ కిషోర్ కుమార్, సభ్యులు నారాయణరెడ్డి, నజీమా కౌసర్ ఆదేశాలు జారీ చేశారు.

యువకుడి ఆత్మహత్య

నంద్యాల టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని అశోక్ నగర్‌లో యువకుడు రఫీ (27) కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రఫీ స్థానికంగా దాల్‌మిల్ నిర్వహిస్తున్నాడు. నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్రమాత్రలు వేసుకున్నాడు. బంధువులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ దారుణ హత్య

• వివాహేతర సంబంధమే కారణం?

వెల్దుర్తి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 14వ వార్డులో నివాసముంటున్న మహిళ షేక్ ఉజ్మా(34) దారుణ హత్యకు గురైంది. బుధవారం సాయంత్రం ఉజ్మా పెద్ద కూతురు కాలేజీ నుంచి ఇంటికి వెళ్లింది. ఇంటికి తాళం వేసి ఉండటంతో తల్లి బయటకు వెళ్లిందేమోనని ఎదురు చూసింది. చిన్న కూతురు కూడా పాఠశాల నుంచి తిరిగి వచ్చాక, తల్లి చెప్పులు బయటే ఉండటం గమనించి అనుమానం కలిగి ఇంటి తాళాన్ని పగులకొట్టి లోపలికి వెళ్లి చూశారు. ఇంట్లో తల్లి రక్తపు మడుగులో ఉండటం గమనించి భయాందోళనతో చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చారు. సీఐ మధుసూదన్‌రావు, ఎస్ఐ అశోక్ కుమార్, ట్రైనీ ఎస్ఐ విద్యశ్రీ సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేశారు. మృతురాలిపై కొడవలితో దాడి చేసినట్లు గుర్తించారు. ఈ హత్యకు వివాహేతర సంబంధం కారణం కావచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఉజ్మాతో వివాహేతర సంబంధం ఉన్న మున్నా అనే వ్యక్తి ఆ సమయంలో అటుగా తచ్చాడాడని స్థానికులు చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు. హత్య చేసిన వ్యక్తి మృతురాలి సెల్ ఫోన్‌తోపాటు సీసీ కెమెరాల డిస్క్ సైతం తీసుకెళ్లినట్లు తెలిపారు. మృతురాలి తల్లి నూర్జహాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధుసూదన్‌రావు, ఎస్ఐ అశోక్ తెలిపారు.



షేక్ ఉజ్మా (ఫైల్)

రెండు లారీలు ఢీ.. డ్రైవర్‌కు తీవ్రగాయాలు

కొలిమిగుండ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బెలుం గుహల వద్ద ప్రధాన రహదారిలో బుధవారం రెండు లారీలు ఢీకొన్నాయి. గుహల వద్ద మలుపు తిరుగుతున్న లారీని మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ కుడికాలు ఇరుక్కోవడంతో స్థానికులు అతడిని బయటకు తీశారు. తీవ్రగాయాలు కావడంతో అతడిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రెండు లారీలు ఢీకొనడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోయాయి. సీఐ రమేష్‌బాబు నేతృత్వంలో పోలీసులు అక్కడికి చేరుకొని లారీలు తొలగించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.



ఢీకొన్న లారీలు

వీగిన అవిశ్వాసం

• పట్టు నిలుపుకున్న మీనాక్షినాయుడు
• కూటమి నాయకుల సంబరాలు
• ఆదోని ఎంపీపీగా దానమ్మ కొనసాగింపు





విజయకేతనం చూపుతున్న నాయకులు, ఇన్‌సెట్‌లో ఎంపీపీ దానమ్మ

ఆదోని రూరల్/ ఆదోని, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ బడాయి దానమ్మపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. వైసీపీకి గట్టి షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు తన మార్క్ రాజకీయంతో పట్టు నిలుపుకున్నారు. దీంతో కూటమి నాయకుల సంబరాలు అంబరాన్నంటాయి. ఎంపీపీ దానమ్మపై వైసీపీ అవిశ్వాస తీర్మాన సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ భవన్‌లో ప్రారంభమైంది. అవిశ్వాస తీర్మానంలో ప్రస్తుత ఎంపీటీసీలను పరిగణలోకి తీసుకుంటే తాము ఎలాగైనా నెగ్గుతామని వైసీపీ ఎంపీటీసీలు భావించారు. 20 మంది మెజార్టీ సభ్యులున్న వైసీపీ ఎంపీటీసీల్లో 16మంది మాత్రమే సమావేశ మందిరానికి వచ్చారు. మిగిలిన నలుగురు వైసీపీ ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. పంచాయతీరాజ్ యాక్టు ప్రకారం 29 ఎంపీటీసీలకు గాను 2/3 చొప్పున 19మంది హాజరు కావాలని అధికారులు సూచించారు. 16మంది వైసీపీ ఎంపీటీసీలు ఉన్నారని, అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్ సభ్యులకు చెప్పారు. ఎంపీపీగా దానమ్మ కొనసాగుతారని చెప్పారు. అవిశ్వాస తీర్మానం వీగిపోవడంతో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి చేదు అనుభవం తప్పలేదు. మీనాక్షి నాయుడు చక్రం తిప్పితే పరాభవం తప్పదని, ఇప్పుడు అదే నిజమైందని ఆయన తన అనుచరులతో చర్చించినట్లు తెలుస్తోంది.

29 మంది ఎంపీటీసీలను..

ప్రభుత్వ ఒత్తిడి వల్ల ఓడించారు. 29మంది ఎంపీటీసీలను పరిగణలోకి తీసుకోవడం తప్పు. మూడు ఎంపీటీసీలకు ఎన్నికలు జరగలేదు. 26మందికే ఎన్నికలు జరిగాయి. అందులో ఇద్దరు మృతిచెందగా, ఒకరు రాజీనామా చేశారు. 23మందిని మాత్రమే పరిగణలోకి తీసుకోవాలి.

- సాయిప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఆదోని

భారీ బందోబస్తు

మండల కార్యాలయ సమీపంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, నలుగురు ఎస్ఐలతో పాటు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో ఏ పార్టీకి చెందిన నాయకులను రానివ్వ కుండా కేవలం ఎంపీటీసీలు మాత్రమే వచ్చేలా చర్యలు చేపట్టారు.

కూటమి నాయకుల సంబరాలు

అవిశ్వాస తీర్మానం వీగిపోవడంతో కూటమి నాయకుల సంబరాలు అంబరాన్నంటాయి. మీనాక్షినాయుడు సోదరుడు, టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడును ఎంపీపీ భర్త బడాయి పంపాపతి ఆలింగనం చేసుకొని కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నాయకులు విట్టా రమేష్, కృష్ణమ్మ, రామస్వామి, ఆచారి, రంగస్వామి నాయుడు, శివప్ప, వీరేష్‌తోపాటు పెద్దఎత్తున మండల కార్యాలయానికి చేరుకొని ఎన్డీఏ జిందాబాద్, చంద్రబాబు జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

మరణానంతర జీవితం

• తల్లి అవయవాలు దానం చేసిన కొడుకులు
• ఫిట్స్‌తో మెదడులో రక్తస్రావమై బ్రెయిన్ డెడ్
• నలుగురికి అవయవాల దానం
• పోలీసులు గ్రీన్ చానల్ ద్వారా అవయవాల తరలింపు





నివాళులర్పిస్తున్న కిమ్స్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, అవయవదాత భాగ్యమ్మ

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అవయవ దానం చేస్తే మరణించిన తర్వాత కూడా జీవించినట్లేనని అంటారు. వ్యాధులతో, ప్రమాదాలతో మృత్యుముఖంలో ఉన్న వాళ్ల జీవితం నిలబెట్టినట్లవుతుంది. బ్రెయిన్ డెడ్ అయిన ఓ తల్లి అవయవాలు దానం చేయడానికి కొడుకులు సిద్ధపడ్డారు. తద్వారా ఆమెకు పునర్జన్మ కలిగేలా చేశారు. ఆమె భర్త ఎప్పుడో 15 ఏళ్ల క్రితమే మరణించారు. తన రెక్కల కష్టంతో ఆమె ఆరుగురు పిల్లను పెంచి పెద్ద చేసింది. అలాంటి తల్లికి ఫిట్స్ వచ్చి మెదడులో రక్తస్రావం జరిగి బ్రెయిన్ డెడ్ అయింది. అవయవదానంతో తమ తల్లి మరణానంతరం కూడా జీవించాలని పిల్లలు భావించారు. ఈ ఘటన కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లో జరిగింది. నంద్యాల జిల్లా శ్రీశైలంలోని కొత్తపేటకు చెందిన భాగ్యమ్మ (50)కు ఈ నెల 18వ తేదీ రాత్రి ఉన్నట్టుండి ఫిట్స్ వచ్చాయి. మొదట ఆమెను శ్రీశైలం దేవస్థానం హాస్పిటల్‌లో చూపించారు. అక్కడి నుంచి 19వ తేదీ కర్నూలులోని మౌర్య హాస్పిటల్‌కి తీసుకువచ్చారు. మెదడులో రక్తస్రావమైనట్లు వైద్యులు గ్రహించారు. అక్కడ వైద్యం చేయించినా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా ఈ నెల 21వ తేదీన బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. ఆమె అవయవాలను దానం చేసే అవకాశం ఉండటంతో జీవన్‌దాన్ స్టేట్ కోఆర్డినేటర్ డా.కే. రాంబాబు బృందం బ్రెయిన్ డెడ్ అయిన మహిళ పిల్లలకు కౌన్సెలింగ్ చేసి అవయవదానంపై అవగాహన కల్పించారు. వారు తమ తల్లి అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. ఒక కిడ్నీని, కాలేయాన్ని కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లోనే చికిత్స పొందుతున్న రోగులకు దానం చేయగా.. మరో కిడ్నిని నెల్లూరులోని అపోలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి, ఊపిరితిత్తులను హైదరాబాదులోని గ్లోబల్ హాస్పిటల్‌కు పంపారు. ఇందుకోసం కర్నూలు పోలీసులు గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి ఎలాంటి ఆలస్యం లేకుండా అవయవాలను తక్కువ సమయంలోనే నెల్లూరు, హైదరాబాదుకు చేరడానికి కృషి చేశారు. అవయవదాత భాగ్యమ్మ కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం, వైద్యబృందం, జీవన్‌దాన్ బృందం అశ్రు నయనాలతో పుష్పాంజలి ఘటించారు.

నిందితుల అరెస్టు

• ప్రొటెక్షన్ వాచర్ మృతి కేసును ఛేదించిన పోలీసులు

ఆత్మకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పాములపాడు మండలం అటవీ ప్రాంతంలో లక్ష్మానాయక్ అనే ప్రొటెక్షన్ వాచర్ మృతికి కారకులైన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం ఆత్మకూరులో డీఎస్పీ రామాంజీనాయక్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచారు. మిడ్తూరు మండలం తలముడిపి గ్రామానికి చెందిన తెలుగు వెంకటేశ్వర్లు (24), పాములపాడు మండలంలోని వేంపెంట గ్రామానికి చెందిన మాదారం సుభాష్ నాయుడు (21) అనే ఇద్దరు ఈ నెల 18వ తేదీన భానుముక్కల-భానుకచెర్ల గ్రామాల మధ్యలో ఉండే అటవీ ప్రాంతంలోని నీటికుంట వద్ద వన్యప్రాణులను వేటాడేందుకు 11కేవీ విద్యుత్ లైన్ నుంచి జీ-వైర్ తీగలను అమర్చారు. అయితే అటవీ రక్షణలో భాగంగా అదే రోజు రాత్రి 10.40 గంటలకు అక్కడికి వెళ్లిన ప్రొటెక్షన్ వాచర్ ప్రమాదవశాత్తు ఆ తీగను తగిలాడు. కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏబీవో వెంకటేశ్వర్లు పాములపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో చాకచక్యంగా దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితులను బుధవారం వెలుగోడు - వేంపెంట రహదారిపై గుంతకందాల గ్రామ శివార్లలో ఉన్న కాశిరెడ్డినాయన ఆశ్రమం వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మోటారు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురి నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించారు. కేసును ఛేధించిన ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి, పాములపాడు ఎస్సై సురేష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ ఎంవీ.రమణ, సిబ్బంది రామానాయుడు, షేక్షావలి, శంకర్‌లను ఎస్పీ సునీల్ షెరాన్, డీఎస్పీ రామాంజీనాయక్ అభినందించారు.

'వస్త్రాలయ' బంపర్ డ్రా విజేతకు కారు

• తాళం చెవిని అందజేసిన ఎమ్మెల్యే గౌరు చరిత



కారు తాళం అందజేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, చిత్రంలో మాల్ యజమాని గోపాల్‌రెడ్డి

కర్నూలు కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మాధవీనగర్ వస్త్రాలయ షాపింగ్ మాల్‌లో బుధవారం బంపర్ డ్రా లక్కీ డిప్ తీశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి చేతుల మీదుగా విజేత రఘుప్రియకు కారు తాళం చెవిని అందజేశారు. షాపింగ్ మాల్ అధినేత గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మాల్ ప్రారంభోత్సవం, దసరా, దీపావళి సందర్భంగా ప్రతి రూ.వెయ్యి కొనుగోలుపై డైలీ లక్కీ డ్రాలో టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, లాప్‌టాప్ అందజేశామన్నారు. అలాగే దీపావళి రోజు బంపర్ డ్రాగా ప్రకటించిన కారును పాణ్యం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేయడం సంతోషంగా ఉందని తెలిపారు. వస్త్రాలపై 10 నుంచి 30 శాతం తగ్గింపు ధరలతో అమ్మకాలు చేస్తున్నామని తెలిపారు.

26న 'పాప దొరికింది' హాస్య నాటిక

కర్నూలు కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 26 ఆదివారం సాయంత్రం 7గంటలకు 'పాప దొరికింది' హాస్య నాటిక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు అధ్యక్ష, కార్యదర్శులు పత్తి ఓబులయ్య, యాగంటీశ్వరప్ప ప్రకటనలో తెలిపారు. గుంటూర ఆరాధన ఆర్ట్స్ అకాడమీ కళాకారుల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి ఆధారంగానే దేశాభివృద్ధి జరుగుతుందని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ఏపీఎస్ఆర్‌డీ అండ్ పీఆర్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం కర్నూలు డివిజన్ పరిధిలోని 7 మండలాల ఎంపీపీలు, సర్పంచులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ మాట్లాడుతూ గ్రామాలనే దేశానికి పట్టుకొమ్మలని, క్షేత్ర స్థాయి అభివృద్ధిలో సర్పంచులు, ఎంపీపీలు కీలక పాత్ర పోషించాలన్నారు. గ్రామస్థాయి అభివృద్ధి కార్యక్రమం, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల నిర్మాణాలు, పారిశుధ్యం, కాలువల నిర్మాణం పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి, డీపీఆర్‌సీ కో ఆర్డినేటర్ మంజులవాణి, శిక్షణ మేనేజర్ గిడ్డేష్, టీఓటీలు వి.జేమ్స్, కృపవరం, జి.నాగేష్, ఎస్.అష్రఫ్ బాషా, పి. జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై వైసీపీకి మాట్లాడే హక్కు లేదు



మాట్లాడుతున్న వై.నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్ల గురించి మాట్లాడే హక్కు వైసీపీ నాయకులకు లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. బుధవారం కార్యాలయంలో దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు షణ్ముఖతో కలిసి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు బీసీలకు 26 నుంచి 34 శాతానికి రిజర్వేషన్లను పెంచారని, దీనిపై వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీల మేరకు సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. షణ్ముఖ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావమే బీసీల అభివృద్ధి కోసమన్నారు. రాంబాబు, సుజాత, కృష్ణోజి రావు, బీసన్న, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

హైస్పీడ్ ట్రాక్‌లకు గ్రీన్ సిగ్నల్

• గంటకు 350 కి.మీ వేగాన్ని తట్టుకునేలా రైలు మార్గాలు



నంద్యాల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల మీదుగా అధునాతనమైన టెక్నాలజీతో హైస్పీడ్ రైల్వే లైన్ నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. బుధవారం రైల్ ఇండియా అండ్ ఎకనామిక్ సర్వీస్ (రైట్స్) అనే సంస్థ ప్రాజెక్టు రూపంలో విడుదల చేసింది. రెండు తెలుగురాష్ట్రాలు మీదుగా 350 కిలోమీటర్ల వేగంతో వెళ్లే దిశగా రెండు హైస్పీడ్ రైలు మార్గాలను నిర్మించనున్నట్లు తెలుస్తోంది. హైదరాబాదు- బెంగళూరు (605కి.మీ), హైదరాబాదు- చెన్నై (760కి.మీ) దిశగా రూపకల్పన చేశారు.

తెలంగాణ, ఏపీ, కర్ణాటక మీదుగా..

హైదరాబాదు- బెంగుళూరు రైలు మార్గం తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల మీదుగా.. హైదరాబాదు- చెన్నై రైలు మార్గం తెలంగాణ, ఏపీ, తమిళనాడు మీదుగా నిర్మించనున్నారు. ప్రస్తుత రైలు ట్రాక్‌పై 130కి.మీ వేగంతో మాత్రమే వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో పున:పరిశీలన చేసి నూతన విధానంలో రైల్వేశాఖ ప్రత్యేక హైస్పీడ్ రైలు మార్గాలకు శ్రీకారం చుట్టినట్లైంది.

వివిధ పనులకు అంచనా..

ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా వెళ్లే హైదరాబాదు- బెంగళూరు లైన్ 605 కి.మీలకు రూ. 2.38 లక్షల కోట్లు, అదేవిధంగా హైదరాబాదు- చెన్నై లైన్ 760 కి.మీలకు రూ. 3.04 లక్షల కోట్లు అంచనా వేశారు. ఈ ప్రకారం.. హైదరాబాదు- బెంగళూరు లైన్ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 46.56 కి.మీలు, నంద్యాల జిల్లాలో 37.3 కి.మీలు, ఉమ్మడి అనంతపురం జిల్లాలో 86.6 కి.మీలు, శ్రీ సత్యసాయి జిల్లాలో 79.08 కి.మీ మేర నిర్మాణం కానుంది. 988.82 హెక్టార్ల భూమి అవసరం కానుంది. కర్నూలు జిల్లాలో 139.68 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 111.9 హెక్టార్లు కేటాయించాల్సి ఉంది.

రైలు రూట్ ఇలా..

హైదరాబాదు- బెంగుళూరు హైస్పీడ్ రైలు మార్గం రూపొందించిన ప్రకారం.. హైదరాబాదు ఎయిర్‌పోర్ట్, భరత్ సీటీ, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్, ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కర్నూలు, నంద్యాల జిల్లాలోని డోన్, అనంతపురం జిల్లాలోని గుత్తి, అనంతపురం, హిందూపురం, కర్ణాటకలోని అలిపుర, దేవనహళ్లి మీదుగా సదరు లైన్ నిర్మించనున్నారు. హైదరాబాదు-చెన్నై లైన్ హైదరాబాదు, శంషాబాద్, భరత్‌సీటీ, ఏపీలోని డచ్చిపల్లి, నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడురు, తిరుపతి, (ఎయిర్‌పోర్ట్) చెన్నై ఐటర్‌రింగ్‌రోడ్, చెన్నై స్టేషన్ల మీదుగా ఏర్పాటు చేయనున్నారు. ఇదే క్రమంలో ఏపీలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల మీదుగా వెళ్లనుంది.

ఒక్కొక్క రైల్వేస్టేషన్‌కు 50 ఎకరాలు..

హైస్పీడ్ రైల్వే నిర్మాణాల్లో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిసారించి త్వరలోనే సదరు పనులకు సంబంధించి అడుగులు వేయనున్నారు. రైలు మార్గాల భూమి అనుకూలమైన అలైన్‌మెంటు గుర్తింపు ప్రక్రియ, ఎక్కడ ఏ స్టేషన్ నిర్మించాలి..? అనే విషయాలపై నిర్ణయం తీసుకుంటారు. ఒక్కొక్క రైల్వేస్టేషన్ నిర్మాణానికి 50 ఎకరాల చొప్పున భూమి సేకరణ చేయడంతో పాటు అవసరమయ్యే మౌళిక సదుపాయాలకోసం సమగ్ర సర్వే, నిర్మాణాల కోసం సమన్వయంలో రైల్వే, ప్రభుత్వం అడుగులు వేయనుంది. ఏది ఏమైనా సదరు రైలు మార్గం సాకారమైతే ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలో బుల్లెట్ రైళ్ల యోగం పట్టనుంది.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పాణ్యం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రభాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. సమావేశంలో పీఈటీ వెంకటేశ్వరరెడ్డి, వెంకటరమణ, శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, మునిశేఖర్, సువర్ణ, అరుణ, ప్రతాప్‌రెడ్డి, పవన్ పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

ఆత్మకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆత్మకూరు డివిజన్ కోఆర్డినేటర్ దేవానంద్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆత్మకూరు మండల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ మురళీనాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థుల ప్రగతిపై శ్రద్ధ చూపాలి

మహానంది, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రగతిపై శ్రద్ధ చూపాలని డిప్యూటీ డీఈవో డీటీ శంకర్ ప్రసాద్ తెలిపారు. బుధవారం మహానంది మండలం ఎం.తిమ్మాపురంలోని జడ్పీ పాఠశాలను డిప్యూటీ డీఈవో తనిఖీ చేశారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, క్విజ్ పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో రామసుబ్బయ్య, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి, సీఆర్పీ తిమ్మయ్యలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

మహానంది, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యమని ట్రాన్స్‌కో ఎస్ఈ సుధాకర్ తెలిపారు. బుధవారం గాజులపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ త్రీఫేస్ విద్యుత్ పనులకు ఆయన భూమి పూజ నిర్వహించారు. ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి, గోపవరం సొసైటీ చైర్మన్ ఉమామహేశ్వర రెడ్డి, రవీనాథ రావు పాల్గొన్నారు.

'అపార్'ను వేగవంతం చేయండి

- కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల అపార్ ఐడీ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అపార్ పురోగతిపై క్లస్టర్ హెచ్‌ఎంలు, ఎంఈవోలు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ స్థాయి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న ప్రతి విద్యార్థి అపార్ ఐడీ కలిగి ఉండాలన్నారు. ఆధార్‌కార్డు ప్రతి పౌరుడికి అవసరమైనట్లు విద్యార్థులకు అపార్ ముఖ్యమైనదన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 85 శాతం విద్యార్థులకు అపార్ జనరేషన్ పూర్తయిందని, మిగిలిన 15 శాతం విద్యార్థుల ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాధికారి జనార్దన్‌రెడ్డి, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మీ డబ్బు - మీ హక్కు అనే నినాదంతో భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా మూడు నెలల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిందని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో మీ డబ్బు - మీ హక్కు అనే పోస్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పౌరులు తమ పేర్లపై ఉన్న క్లెయిమ్ చేయని లేదా మరిచిపోయిన ఆర్థిక ఆస్తులను తిరిగి పొందే అవకాశం కల్పించిందన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు నంద్యాల జిల్లాలోని 27 కస్తూర్బా గాంధీ బాలికా పాఠశాలలకు 27 కంప్యూటర్లు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి.నరసింహారావు, ఎల్డీఎం రవీంద్ర కుమార్, యూనియన్ బ్యాంక్ నూనెపల్లి బ్రాంచ్ మేనేజర్ మల్లికార్జున, డీఈవో, కేజీబీవీ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్త్రీనిధి రుణాలు - వాయిదా చెల్లింపులు పోస్టర్‌ను కలెక్టర్ రాజకుమారి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో రామునాయక్, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై.బి.శ్రీధర్‌రెడ్డి, స్త్రీనిధి ఏజీఎం నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

రెవెన్యూ సేవలు సకాలంలో అందించాలి

నంద్యాల టౌన్: సచివాలయాల ద్వారా రెవెన్యూ సేవలు సకాలంలో అందించాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. బుధవారం స్థానిక ఎన్జీవో కాలనీలో ఒక సచివాలయాన్ని తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయంలో రెవెన్యూ సంబంధిత సేవలు ఆలస్యం అవుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో తనిఖీ చేశామన్నారు. జనవరి నుంచి సెప్టెంబరు 30వరకు ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వయంగా పరిశీలించారు. ఎక్కువ శాతం దరఖాస్తులు ఇతర మండలాలకు చెందినవిగా గుర్తించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయల్టీని రద్దు చేయించాలి

నందికొట్కూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నాపరాళ్ల గనులపై విధించిన రాయల్టీలను రద్దు చేయాలని నాపరాళ్ల గనుల యజమానులు కోరారు. బుధవారం అల్లూరులో ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాపరాళ్ల గనుల యజమానులు పి. రవీంద్రబాబు, జయరాముడు, వడ్డె శ్రీనులు మాట్లాడుతూ నాపరాయి బండలకు మెట్రిక్ టన్నుకు రూ.240 రాయల్టీ విధించడం భావ్యంకాదన్నారు. నాగలూటి నాపరాతి గనులకు ఎలాంటి రాయల్టీ చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పి. రవీంద్రబాబు, జయరాముడు, వడ్డె శ్రీను, అజీజ్, పెద్దవలి, కృష్ణ, వడ్డె మల్లికార్జున, దూదేకుల బాబుసా తదితరులు పాల్గొన్నారు.

- నందికొట్కూరు మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలను అల్లూరు గ్రామంలో నిర్వహించారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కేక్ కట్‌చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసులు, తిమ్మారెడ్డి, శ్రీరాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ అస్తిత్వం కాపాడుకోవడానికే ఆరోపణలు

వైసీపీ తన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికే నకిలీ మద్యం అంటూ బూటకు ప్రచారం చేస్తోందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. బుధవారం పట్టణంలోని జనార్దన్ వైన్స్‌ను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. షాపులోని మద్యం బాటిళ్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను యాప్ ద్వారా పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న అసత్యపు ఆరోపణలను నమ్మవద్దని ఆయన సూచించారు. ఎమ్మెల్యే వెంట నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, పార్టీ పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను కలిసిన నాపరాళ్ల గని యజమానులు

జాయింట్ కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కార్తీక్‌ను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మర్యాదపూర్వకంగా కలిశారు. నందికొట్కూరులో మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర లేక తక్కువ ధరకే అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జేసీని కోరారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు గురురాజ విద్యార్థి

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలో ఉన్న గురురాజ ఇంగ్లీష్‌మీడియం పాఠశాల క్రీడాకారుడు ఓజో రంగసాయి జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. నవంబరు 3నుంచి మణిపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నంద్యాల కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలోని వీరభద్రస్వామికి విశేష పూజలు చేశారు. మల్లికాగుండంలోని శుద్ధజలంతోనూ విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పుష్పార్చన చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలదేవస్థానంలో నిత్యకళారాధనలో భాగంగా బుధవారం హైదరాబాదు శ్రీభ్రామరీ కూచిపూడి డాన్స్ అకాడమీ వారిచే సాంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమం ఏర్పాటుచేశారు. వినాయక కౌత్వం, తాండవ నృత్యం, నమశ్శివాయతే, శివ పంచాక్షరీ, శివ మంగళాష్టకం, తదితర గీతాలకు స్తోత్ర, సౌమ్య, కాంచన తదితరులు నృత్యప్రదర్శన చేశారు.



విద్యుత్ కాంతులతో శ్రీశైల క్షేత్రం

శ్రీశైల క్షేత్రంలో కార్తీక శోభ..

శ్రీశైల మల్లికార్జున జ్యోతిర్లింగ శ్రీభ్రామరీ శక్తి పీఠం కార్తీకమాసం మొదటిరోజు బుధవారం శ్రీశైలక్షేత్రం విద్యుత్ దీపాలతో కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీకమాసం సందర్భంగా భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

పాతాళగంగలో ప్రత్యేక ఏర్పాట్లు

నంద్యాల కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల పుణ్యక్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు బుధవారం నుంచి అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు పుణ్యస్నానాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పాతాళగంగ, గంగాధరమండపం, పుష్కరిణి తదతర ప్రదేశాలను ఈవో శ్రీనివాసరావు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఈవో ఆదేశించారు.


పుష్కరిణి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

పారదర్శక ఓటరు జాబితాకు సహకరించాలి

ఆత్మకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో పారదర్శక ఓటరు జాబితా తయారీకి ఆయా రాజకీయ పార్టీలు సహకరించాలని తహసీల్దార్ రత్నరాధిక కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు 18ఏళ్లు పూర్తయిన వారికి ఓటు హక్కు నమోదు చేసుకునేలా చొరవ తీసుకోవాలని అన్నారు. అలాగే ఓటరు జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులు ఉన్నట్లయితే సరిచేసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ రవణమ్మ, సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దారు రత్నరాధిక

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

పాములపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక ఏఎస్ఆర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మకూరు డివిజన్‌స్థాయి క్రీడాపోటీలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీవో, ఎంఈవో బాలాజీనాయక్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయా విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ రాజశేఖర్, విద్యాకమిటీ చైర్మన్ పద్మావతి, పీఈటీలు సాయి, రాజశేఖర్, రవి, శ్రీను, స్వామిశేఖర్, రామకృష్ణ, దాక్షాయణి, మల్లిక, షంషుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

మిడుతూరు: మండల కేంద్రం మిడుతూరు గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలను తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో దశరథరామయ్య, ఎంఈవో మల్లికార్జున నాయక్ ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మిడుతూరు విద్యార్థులకు తువ్వా అయ్యపురెడ్డి క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయి తిమ్మయ్య, టీడీపీ మండల కన్వీనర్ కాత రమేష్ రెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.

నంద్యాల హాస్పిటల్: రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు నూనెపల్లె మున్సిపల్ పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఏవీఎస్ చలపతి తెలిపారు. వీరు ఈ నెల 26నుంచి విశాఖపట్టణంలో జరిగే అండర్-14 రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. పాఠశాల సెక్రటరీ వరప్రసాదరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థినులకు అవసరమైన ఆర్థికసాయం అందజేస్తామన్నారు.

జాతీయ క్రీడా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి ఎస్ఎంవీ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డులతో పాటు రాష్ట్రీ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాలకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు ఈనెల 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేటితో ముగియనున్న గడువు

నంద్యాల టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నంద్యాల పురపాలక సంఘం పరిధిలో అనాధికార లేఅవుట్లు క్రమబద్ధీకరించుకోవడానికి గురువారం ఆఖరి రోజు అని కమిషనర్ బండి శేషన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్ఎస్‌పై మూడు నెలల నుంచి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గడువులోగా అనాధికార లేఅవుట్లను తప్పనిసరిగా క్రమబద్ధీకరించుకోవాలన్నారు. లేనివాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. వివరాలకు పురపాలక సంఘంలో పట్టణ ప్రణాళిక విభాగాన్ని సంప్రదించాలన్నారు.

మొక్కజొన్న కొనుగోలు చేయాలి

నంద్యాల రూరల్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని వైసీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో వైసీపీ ఆధ్వర్యంలో కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కనీస మద్దతు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి, రూపేం ద్రకుమార్‌రెడ్డి, వెంకటనారాయణ, రంగడు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

పాణ్యం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ముందు గురువారం చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి కెజే శ్రీనివాస్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా వ్యవసాయంలో తీవ్రంగా నష్టపోతున్న రైతులను ఆదుకోవాలన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

మిడుతూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని డీసీపీవో శ్రీనివాసులు అన్నారు. బుధవారం మిడుతూరు కస్తూర్బా పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఐసీడీఎస్ సూపర్ వైజర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు ఇచ్చారు. సమావేశంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో దశరథ రామయ్య, డాక్టర్ తిరుపతి, ఎంఈవో మల్లికార్జున నాయక్ టీడీపీ మండల కన్వీనర్ కాత రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులున్నారు.

ఆధార్ క్యాంపును వినియోగించుకోవాలి

పాములపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పాములపాడులోని శ్రీ శారద విద్యానికేతన్ పాఠశాలలో గురువారం నుంచి 30వరకు చైల్డ్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

కొత్తపల్లి: మండలంలో ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల్లోని పాఠశాలలో ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో మేరీ తెలిపారు. విద్యార్థులు వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి తేవాలి

నంద్యాల రూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటులోకి తేవాలని సీపీఎం నాయకులు లక్ష్మణ్, గౌస్ కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేయడంతో డబ్బులు కట్టలేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులు లాభాల కోసం తప్ప పేదలకు కూటమి ప్రభుత్వం ఉపయోగకరంగా లేకపోవడంతో బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

డీఏ విడుదల చేయాలి

పాణ్యం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏ అరియర్స్ ప్రభుత్వం విడుదల చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్రనాయకులు సిమియోన్ డిమాండ్ చేశారు. బుధవారం పాణ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అప్‌గ్రేడ్ అయిన పీఎస్ హెచ్‌ఎం కలిగిన ప్రైమరీ పాఠశాలలకు యూడైస్ కోడ్ వెంటనే ఇవ్వాలన్నారు. 2010 ఆగస్టు కంటే ముందు నియమించిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు కలిముల్లా, మండల అధ్యక్షుడు మాధవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థపై సుంకాల ప్రభావం

ఆత్మకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అమెరికా భారత్‌పై విధిస్తున్న సుంకాలతో దేశ ఆర్థిక వ్యవస్థపై పెనుభారం పడనుందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక కృషి పండ్ల తోటల సంఘం కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అమెరికా విధిస్తున్న సుంకాలతో అక్కడ నివసిస్తున్న 45లక్షల మంది భారతీయుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మునీర్, మహెబూబ్‌బాషా, వీరన్న, సుధాకర్ తదితరులు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

నందికొట్కూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో రోడ్లు, కరెంటు , నీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ బేబికి సీపీఎం నాయకులు ఉస్మాన్‌బాషా, కొంగర వెంకటేశ్వర్లు, నాగన్న, లక్ష్మన్న వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జగనన్న కాలనీ వాసులు ఉన్నారు.

రుద్ర కోటేశ్వరాలయానికి కార్తీక శోభ

ఆత్మకూరురూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మొదటిరోజును పురస్కరించుకుని నల్లమల అభయారణ్యంలో వెలసిన రుద్రకోటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వెలసిన రుద్రాణి సహిత రుద్రకోటేశ్వర స్వామి అమ్మవార్లకు ప్రాతఃకాల సమయంలోనే ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణ చేశారు. అదేవిధంగా క్షేత్రపరిధిలో ఉన్న నాగులకట్ట వద్ద భక్తులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులందరికీ వెలుగోడు ఆర్యవైశ్యసంఘం, దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పాణ్యం: మండలంలో కార్తీక మాస పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు సురేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజలు, గంధం, అభిషేక పూజలు, రుద్రాభిషేకం, అర్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో రామకృష్ణ, సిబ్బంది నాగేశ్వరరావు, సుబ్బారెడ్డి, పాల్గొన్నారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

నిఘా నీడలో కొలిమిగుండ్ల

రామ్‌కో సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు



కొలిమిగుండ్ల ప్రధాన రహదారి

కొలిమిగుండ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొలిమిగుండ్ల ఇక పూర్తిగా నిఘా నీడలో చేరనుంది. కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు విజ్ఞప్తి మేరకు రామ్‌కో సిమెంట్ పరిశ్రమ సహకారంతో పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి పనులు ప్రారంభించారు. మూడేళ్ల క్రితం కొలిమిగుండ్లలో రోడ్డు వెడల్పు సందర్భంగా గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మొత్తం ధ్వంసమయ్యాయి. సీఐ రమేష్‌బాబు గత కొద్ది రోజులుగా రామ్‌కో పరిశ్రమ సహకారం కోసం విజ్ఞప్తి చేస్తున్నారు. ఫలితంగా రామ్‌కో యజమాన్యం సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చినట్లు సీఐ వెల్లడించారు. జమ్మలమడుగు సర్కిల్‌తోపాటు, తేరు వీధి, ఆర్టీసీ బస్టాండు, బ్యాంకు, పోలీస్ స్టేషన్ తదితర ప్రధాన కూడళ్లలో సుమారు 15 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ వెల్లడించారు.

కేజీబీవీ పాఠశాలకు వాటర్ ట్యాంక్ విరాళం

బేతంచెర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీ పాఠశాలకు 1500 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను విరాళంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు అశ్వర్థ నారాయణ, కార్యదర్శి రాజేష్ ప్రిన్సిపాల్ అబీదాబేగంకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలకు పాఠశాలలో నీటి సౌకర్యార్థం వాటర్ ట్యాంక్‌ను అందజేశామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు మద్దిలేటి స్వామి, సత్తార్, మక్బుల్, రామ్మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

డోన్ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 25వ తేదీన నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని డీఎస్పీ పి. శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 25న డోన్ పట్టణం రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న క్లబ్ హౌస్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో పోలీసులు మాత్రమే కాకుండా ప్రజలు కూడా పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

జూదరుల అరెస్టు

కోవెలకుంట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుగొట్ల గ్రామానికి చెందిన 12 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు. బుధవారం ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. కలుగొట్ల గ్రామంలో కొంత మంది పేకాటాడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేయగా మారెమ్మ ఆలయం సమీపంలో పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.31,290 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కార్తీక మాస పూజలు ప్రారంభం

డోన్ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో కార్తీకమాస పూజలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు సాంబ శివాలయంలో శివునికి భక్తులు న్యాయవాది నాగభూషణం రెడ్డి, హనుమంతరెడ్డి, కల్లె అనూరాధతోపాటు భక్తులు పూజలు చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.



డోన్‌లో శివుడికి పూజలు చేస్తున్న భక్తులు, ప్యాపిలిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని రామలింగేశ్వర, భీమలింగేశ్వర ఆలయాల్లో బుధవారం కార్తీక మాస ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయాల్లో మహిళలు దీపాలు వెలిగించారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.



చాగలమర్రి రామలింగేశ్వర ఆలయంలో ఆకాశ దీపాన్ని వెలిగిస్తున్న అభినవ శంకరానంద స్వామి

ఆకాశ దీపాన్ని అభినవ శంకరానంద స్వామిజీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రుద్రవరం: రుద్రవరంలోని భాస్కర నందీశ్వరాలయంలో ఆలయ నిర్వాహకుడు ఏరువ క్రిష్ణమూర్తి ఆకాశ దీపాన్ని ప్రారంభించారు. కోటకొండ, యల్లావత్తుల, చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, ఆలమూరు, మందలూరు, చందలూరు గ్రామాల్లోని శివాలయాల్లో పూజలు ప్రారంభించారు. శివుడికి అభిషేకం చేసి వేద మంత్రోచ్ఛారణల మధ్య అర్చకులు పూజలు ప్రారంభించారు. తరలివచ్చిన మహిళలు దీపాలు వెలిగించారు.

ప్యాపిలి: పట్టణంలోని ఈశ్వరస్వామి, నీలకంఠేశ్వరస్వామి, భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయాల్లో బుధవారం మహిళలు పూజలు చేశారు. స్వామివారికి జలాభిషేకాలు నిర్వహించారు. అలాగే మహిళలు ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించారు.

స్వాతంత్ర్య సమరయోధుడికి నివాళి

బనగానపల్లె, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సీపీఐ కార్యాలయంలో స్వాతంత్ర సమరయోధుడు అష్ఫాకుల్లా ఖాన్ జయంతి సందర్భంగా బుధవారం ఆయనకు నివాళి అర్పించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడంతో ఉరి తీశారన్నారు. కార్యక్రమంలో ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబాఫకృద్దీన్, సీపీఐ మండల కార్యదర్శి శివయ్య, బాలకృష్ణ, సంజీ వులు, ఎర్రిస్వామి, ఖాదర్, శివనాగయ్య, నాగాంజనేయులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డలోని పడకండ్లలో కేపీజీ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు అష్ఫాకుల్లా ఖాన్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం రవి ఆధ్వర్యంలో అపుస్మా నియోజకవర్గ అధ్యక్షుడు అమీర్‌బాషా అష్ఫాకుల్లా ఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అమీర్‌బాషా మాట్లాడుతూ దేశం కోసం అష్ఫాకుల్లా ఖాన్ తన ప్రాణాలను అర్పించారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అష్ఫాకుల్లా ఖాన్‌కు నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

కార్తీకమాస ఉత్సవ పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

చాగలమర్రి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో బుధవారం కార్తీకమాస ఉత్సవ పుస్తకాలను ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విడుదల చేశారు. పుస్తకాలను దాత లకు, భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ టీడీపీ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీడీపీ నాయకులు గుత్తి నరసింహులు, ధనుంజయుడు, శంక రాచారి, సత్యనారాయణ, మురళి, మధు, సుధాకర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి రమణయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

కొలిమిగుండ్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జోరుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని కొలిమిగుండ్ల డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి సూచించారు. బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

సంజామల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం అందజేసే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల ఇన్‌చార్జి బత్తుల ప్రతాప్ రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని గిద్దలూరు గ్రామంలో సబ్సిడీపై ప్రభుత్వం అందజేసిన శనగ విత్తనాలను ఆయన రైతులకు పంపిణీ చేశారు. 25శాతం రాయితీతో క్వింటా శనగలు రూ. 5850తో ప్రభుత్వం అందజేస్తుందన్నారు. విత్తనాలతోపాటు వ్యవసాయ శాఖకు సంబంధించి ప్రభుత్వం అందజేసే వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం తీపి కబురు

బనగానపల్లె/ సంజామల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని పేదలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించిందని బనగానపల్లె హౌసింగ్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ బాలచంద్రుడులు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద రాష్ట్రంలోని గ్రామీణ ప్రాతాల్లో ఇళ్లు లేని పేదలను గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మందికి పైగా అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్ర గృహ నిర్మాణ శాఖ చేపట్టిన సర్వే గడువు దేశ వ్యాప్తంగా 2 నెలల క్రితమే ముగిసింది. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో 5లక్షల మందికి పైగా పేదలు ఇల్లు లేకుండా ఉన్నారని అధికారులు గుర్తించి నివేదించారు. దీనిపై స్పందించి ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే కేంద్రానికి తెలియజేయడంతో ఏపీలో ప్రజలకు ప్రత్యేక అవకాశం వచ్చిందన్నారు. నవంబరు 5 వరకు ఇల్లు లేని అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

దుకాణాలపై దాడులు

బనగానపల్లె, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్లాస్టిక్ అమ్ముతున్న కిరాణ దుకాణాలపై గ్రామ పంచాయతీ ఈవో సతీశ్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు లభించిన 3 కిరాణా దుకాణాలకు, రెండు కూరగాయల దుకాణాల వ్యాపారులకు ఈవో సతీశ్‌రెడ్డి జరిమానా విధించారు.

మానవత్వం చాటుకున్న జనసేన నాయకుడు

డోన్ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు వ్యక్తులను డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తన కారులో తరలించి జనసేన నాయకుడు మానవత్వం చాటుకున్నాడు. పట్టణం సమీపంలోని రూరల్ పోలీస్ స్టేషన్ ప్రధాన రోడ్డులో ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడగా.. అటువైపు కారులో వెళ్తున్న జనసేన నాయకుడు మైఖేల్ గాయ పడిన ఇద్దరిని కారులో ఎక్కించి డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అదనంగా 395 క్వింటాళ్ల శనగలు : ఏవో

కొలిమిగుండ్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో సబ్సిడీ శనగల కొరత కారణంగా అధికారులతో మాట్లాడి, ఇతర మండలాల నుంచి 395 క్వింటాళ్ల శనగలను అదనంగా కేటాయించినట్లు మండల వ్యవసాయ అధికారి శారదాదేవి బుధవారం తెలిపారు. అదనపు శనగల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : ఎంపీడీవో

ఉయ్యాలవాడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యద ర్శులు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలానికి 596 ఇంకుడు గుంతలు మంజూరయ్యాయని, ఒక్కో ఇంకుడు గుంతకు రూ.6వేలు ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. ఏపీవో హరిక్రిష్ణ పాల్గొన్నారు.

గొడిగనూరులో కూలిన మట్టిమిద్దె

చాగలమర్రి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిగనూరు గ్రామంలో భారీ వర్షాలకు తడిచిన మట్టిమిద్దె బుధవారం కూలింది. ఎస్సీ కాలనీలోని పుష్పరాజుకు చెందిన మిద్దె కూలి నష్టం వాటిల్లింది. ఆ సమయంలో ఇంట్లో కుటుంబ సభ్యులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ఆర్ఐ అబ్దుల్‌సత్తార్, కార్యదర్శి రాజశేఖర్ మిద్దెను పరిశీలించి నష్టం అంచన వేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

డోన్ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని డోన్ రూరల్ ఎస్ఐ మమత అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో గ్రామస్థులకు ప్రొజెక్టర్ ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

చాగలమర్రి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల అన్నారు. బుధవారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడా పోటీలను వారు ప్రారంభించారు.

చనిపోయిన ఓటర్ల తొలగింపునకు సహకరించాలి: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో విశ్వనాథ్

ఆళ్లగడ్డ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చనిపోయిన ఓటర్ల తొలగింపు కార్యక్రమానికి అన్ని పార్టీల నాయకులు సహకరించాలని నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిచారు. ఆర్డీవో మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడుకి ఓటు నమోదు చేయాలని, అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ బూతుల పరిధిలో ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, వివిధ శాఖల అధికారులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పొంగి ప్రవహించిన వకుళానది

రాకపోకలు బంద్



చిలకలూరు సమీపంలో పొంగి ప్రవహిస్తున్న వకుళానది

రుద్రవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలూరు గ్రామ సమీపంలో వకుళానది పొంగి ప్రవహించింది. బుధవారం రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం కురిసినప్పుడల్లా చిలకలూరు గ్రామ సమీపంలో నేలవంతెనపై వకుళానది పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరోగ్య సేవలను అందుబాటులోకి తేవాలి

బనగానపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ వైద్య ఆరోగ్య సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తేవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. బుధవారం బనగానపల్లె ప్రాంతీయ వైద్యశాల ఎదుట నిరసన చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఎన్‌టీఆర్ ఆరోగ్య సేవలకు సంబంధించి రూ.2700 కోట్లు ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించలేదన్నారు. దీంతో ఈనెల 10నుంచి ఎన్టీఆర్ ఆరోగ్యసేవలు నిలిచిపోయాయన్నారు. విద్య, వైద్యం ఉచితంగా అందించాలని కోరారు. మండల సీపీఐ కార్యదర్శి శివయ్య, జిల్లా సమితి సభ్యులు సంజీవులు, సుబ్బారెడ్డి, శివబాలకృష్ణ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

రైతుల సంక్షేమమే నాబార్డు ధ్యేయం

ప్యాపిలి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే నాబార్డు ధ్యేయమని ఆ సంస్థ జిల్లా డెవలప్‌మెంటు మేనేజరు కేఆర్‌డీ కార్తీక్ అన్నారు. బుధవారం మండలంలోని కలచట్ల గ్రామంలో వాటర్‌షెడ్ ప్రోగ్రాం ద్వారా రైతులకు అవ సరమైన వ్యవసాయ పనిముట్లను ఏర్పాటు చేశారు. కార్తీక్ మాట్లాడుతూ నూతన వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా డ్రోన్ స్ప్రెయర్, దుక్కిదున్నే, విత్తన యంత్రాలను గ్రామంలో అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో షర్ రూరల్ అండ్ ఏకో డెవలప్‌మెంటు సొసైటీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఏడీఏ సునిత, ఏవో రాజేష్, బ్యాంక్ మేనేజర్లు గోకురామయ్య, సతీష్‌రెడ్డి, రాకేష్, రమా దేవి, కలచట్ల ప్రసాద్, రవి, రాజా పాల్గొన్నారు.



డ్రోన్ స్ప్రెయర్‌ను చూపుతున్న నాబార్డు మేనేజరు, వాటర్ సంస్థ ప్రతినిధులు